క్లుప్తంగా

కోరం లేక సభ వాయిదా

కాటారం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరం సభ్యులు సమావేశానికి హాజరుకాకపోవడంతో ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆదేశాల మేరకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ బాబు తెలిపారు. మండల సమావేశ నిర్వాహణకు మరో తేదీని ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

టేకుమట్ల : మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో గురువారం అన్యువల్ డే, గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హరీష్ కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం కిండర్ గార్డెన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్‌తో సన్మానించారు.

'విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు'



కాళేశ్వరం : కాళేశ్వరం పరిధి అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేటకు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భవానిసేన్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో రాత్రి వేళలో వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఎవరైనా అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగల ఏర్పాటు చేసి వేటకు పాల్పడితే కఠిన కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే చంద్రుపల్లి గ్రామంలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'తునికాకు కట్టకు రూ. 5 చెల్లించాలి'

వెంకటాపురం(కె) : 50ఆకుల తునికాకు కట్టకు రూ. 5 చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తునికాకు సేకరణకు వెళ్లిన తునికాకు కార్మికులు అడవి జంతువులబారిన పడి అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షలు, మరణిస్తే రూ.5లక్షలు చెల్లించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ నగదును తక్షణమే చెల్లించాలని కోరారు.

పరామర్శ



ఏటూరునాగారం : మండలంలోని గోగుపల్లి వద్ద ట్రాక్టర్ బోల్తా పడి ఉపాధిహామీ పథకం కూలీలకు గాయాలై ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు అశోక్, బ్లాక్ అధ్యక్షుడు వెంకన్న ఆదేశాల మేరకు ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరిశీలించి వారి వైద్యసేవలకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు తెలిపారు. నాయకులు ఎల్లయ్య, రంజిత్, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రాలు



చిట్యాల : ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం.. ఏదైనా నేరం జరిగితే వీటి పాత్ర ముఖ్యం.. కానీ గస్తీగా ఉన్న సీసీ కెమెరాలు నేడు పనిచేయకుండా ఉన్నాయి.. దీంతో అనుకొని ఏదైనా ప్రమాదం, నేరం జరిగితే ఎలా ఛేదిస్తారని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల చాటున దర్శనమిస్తున్నాయి. దీంతో యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలతో పాటు అనేక దందాలకు పాల్పడుతున్నారు. కేసులను ఛేదించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న నిఘా నేత్రాలు నేడు నిరాధారణకు నోచుకోకుండా పోయాయి. గతంలో వర్షాల కారణంగా పిడుగుపాటుకు కెమెరా ఐసీలు కాలిపోవడంతో వాటిని ఇప్పటి వరకు అధికారులు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఎవరు చూడడం లేదనే భావనతో ఇష్టారాజ్యంగా రాత్రిపూట అనేక చోరీలు, నేరాలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రంలో 12 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా వాటిని కనీసం అధికారులు పట్టించుకోకపోవడంతో దిష్టిబొమ్మల్ల దర్శనమిస్తున్నాయి. దొంగలను, ఇతర నేరాల్లో నిందితులు గుర్తింపునకు సీసీ కెమెరాలే ఆధారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సీసీ కెమెరాలలను మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకు రావాలని వాహనాదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

● సీఐ బండారి కుమార్



వెంకటాపురం(కె) : గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కుమార్

వెంకటాపురం(కె) : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే చట్టాన్ని చేతులోకి తీసుకోకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బల్వీందర్ సింగ్, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

వాజేడు : మండలంలోని ఇప్పగూడెం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. వాజేడు ఎస్సై వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు అందులోని బ్యాగులు, లగేజీని సోదాలు చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వాహనాల్లో లగేజీని, బ్యాగులను తనిఖీ చేశారు. ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నది అడిగి తెలుసుకున్నారు. కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న ఎస్సై

విద్యార్థులు, అధ్యాపకులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ఎస్సై రవికుమార్

మంగపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సై గోదారి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య అధ్యాపకులను ఘనంగా సన్మానించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టాలెంట్ అనేది ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గొప్ప వ్యక్తులు, మేధావులుగా గుర్తింపు పొందిన వారిలో అనేకమంది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా విని పట్టుదలతో చదివితే ఎలాంటి ర్యాంకైనా సాధించవచ్చని, ఎంత గొప్ప స్థాయికైనా ఎదగవచ్చన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తు ముందు తరాల విద్యార్థులకు ఆదర్శంగా స్ఫూర్తినింపేలా ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, సభ్యులు సయ్యద్‌బాబా, బండపల్లి రవి, ఆత్మకూరి సతీష్, మహేష్, ఇంతియాజ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు, బియ్యం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెగరకంటి ముత్తేష్ కుమార్తె వివాహానికి ఆ పార్టీ మండల నాయకులు రూ.20వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి విజయ్‌కుమార్, నాగరాజు, గౌస్, ఖలీల్, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే వర్గీకరణ సాధ్యం'



మాట్లాడుతున్న లేతకారి రాజబాపు

కాళేశ్వరం : అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణలో బీజేపీ సభలు నిర్వహించి వర్గీకరణకు మద్దతు తెలిపింది.. కమిటీ వేస్తామని ఎన్నికల తర్వాత ఆ మాటే ఎత్తడం లేదని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాపు విమర్శించారు. వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. కాళేశ్వరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ను మాదిగ జాతి బిడ్డలు నమ్మరని పేర్కొన్నారు. మరోసారి ఆయా పార్టీ నాయకుల మాటలతో మోసపోడానికి మాదిగలు సిద్ధంగా లేరని చెప్పారు. కొంతమంది చిల్లర విమర్శలు చేసిన మాదిగలు అంతా కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆ అక్కసుతోనే ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదన్నారు. అందుకే మాదిగలను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో అన్నారం ఎంపీటీసీ దుర్గయ్య, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు శంకర్, కొరాల సురేందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని పలు గ్రామాల్లోని 16 గొత్తికోయ గూడెంలో స్థానిక సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల సందేశాలకు సమాధానాలకు ఇవ్వకూడదన్నారు. ఎవరైనా ఓటీపీ కోసం కాల్ చేస్తే ఎలాంటి సమాధానం ఇవ్వొద్దని సూచించారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. అనుకొని సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాలని, తప్పులు, నేరాలు చేసే వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దన్నారు. అడవుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణా రెడ్డి

రేగొండ(కొత్తపల్లిగోరి) : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హమీద్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు పకిడే కిరణ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘుసాల తిరుపతి, యూత్ అధ్యక్షుడు భిక్షపతి నాయకులు ధనుంజయ, సుమన్, శంకర్, శ్రీనివాస్, సంతోష్ తదితరరులు పాల్గొన్నారు.

విహారయాత్రతో విజ్ఞానం, వినోదం



రామప్ప ఆలయాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు

మంగపేట : మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంశ్రీ నిధులపై ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు విహారయాత్రకు తరలినట్లు హెచ్ఎం భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్సులు, విజ్ఞాన కేంద్రాలు, పార్కులు, పరిశ్రమలు వారసత్వ సంపద, కోటలు, గోడలు మొదలైన వాటిని సందర్శించేందుకు కేంద్రప్రభుత్వ పీఎంశ్రీ పథకం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 130 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను వరంగల్ రీజినల్ సైన్స్ సెంటర్, వనవిజ్ఞానకేంద్రం, కాకతీయుల కోట, ఏకశిలా నగరం, లక్నవరం సరస్సు, హంగింగ్ బ్రిడ్జి(వేలాడే వంతెన) రామప్ప దేవాలయం, సరస్సు తదితర వాటిని సందర్శించారని పేర్కొన్నారు. ఈ సందర్శనతో విద్యార్థుల్లో మనోవిజ్ఞానం, వికాసం, వినోదంతో సృజనాత్మక శక్తి ఏర్పడుతుందన్నారు. ప్రత్యక్షంగా చూడడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యఅభివృద్ధి చెందుతాయని ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బానోత్ బాలాజీ, ఎస్.జమున, పద్మ, లావణ్య, మహదేవి, ప్రమీల, లక్ష్మీనారాయణ, రాచమళ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రీజినల్ సైన్స్ సెంటర్ వద్ద విద్యార్థులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఏటూరునాగారం : ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ములుగు పట్టణంలో జరిగిన పార్టీ సమావేశంలో బట్టల శెట్టి గౌతం, చావ భాస్కర్, కొంకటి శ్రీనివాస్, జెగజెంపుల సమ్మయ్యలకు మంత్రి ధనసరి సీతక్క కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు ఎరబ్రెల్లి మనోజ్, చిటమట రఘు, ఖలీల్, కన్నాయిగూడెం జెడ్పీటీసీ చందు, అయూబ్, ముక్కెర లాలయ్య, సులేమాన్ గంపల శివ, హన్మంత్, పాగా నాగరాజు, శ్రీనివాస్, రంజిత్, నర్సింహారావు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

కాంగ్రెస్‌లో చేరిక

మంగపేట : మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన బట్టర్‌శెట్టి గౌతమ్‌కుమార్ మంత్రి సీతక్క సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో ఆయన యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ వైస్ ప్రెసిడెంట్, మండల ప్రెసిడెంట్‌గా పనిచేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న ఆయన గురువారం ములుగు లీలాగార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీలో చేరగా కాంగ్రెస్ కండువాతో సత్కరించి మంత్రి సీతక్క పార్టీలోకి ఆహ్వానం పలికారు. మంత్రి సీతక్క నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు ఎప్పటికి సముచిత స్థానం ఉంటుందని గ్రహించి తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సునీల్

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలో ట్రెండ్ యూత్ ఆధ్వర్యంలో ఎంపీఎల్–2 ముత్యాలమ్మ కప్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. టోర్నమెంట్ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ టోర్నమెంట్‌ను ప్రారంభించి, మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, యువతను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకాళ్ల స్వామి, తాటి నరేష్, కొర్నబెల్లి సేనాపతి, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, బండారి అనిల్, ట్రెండ్ యూత్ కమిటీ సభ్యులు బాలాజీ, వెంకటేష్, అజయ్, శ్రీను, సూర్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



ఏటూరునాగారం : బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు



కన్నాయిగూడెంలో..

ఏటూరునాగారం : ఏటూరునాగారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కమలాపురం, మల్లూరు, తిమ్మంపేట గ్రామాల్లో గురువారం ఏటూరునాగారం ఎక్సైజ్, ములుగు ఎక్సైజ్ పోలీస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా నాటుసారా(గుడుంబా) స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో 25 లీటర్ల గుడుంబా, 20 కిలోల బెల్లం, 10కిలోల పటిక, 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. మూడు ప్రాంతాల్లో దాడులు చేసి భూక్య సాలమ్మ, భూక్య శాంత, ధరావత్ రాధ, గుగులోత్ భూమిక, భూక్య నాగేశ్వర్‌రావు, బొల్ల సురేష్(బెల్లం వ్యాపారి)పై కేసులు నమోదు చేశామన్నారు. ములుగు సీఐ సుధీర్‌కుమార్, సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం..కేసు నమోదు

కన్నాయిగూడెం : ద్విచక్ర వాహనంపై గుడుంబాను తరలిస్తున్న వ్యక్తులను స్థానిక ఎస్సై సురేష్ పట్టుకున్నారు. మండలంలోని తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టలగంగారం వద్ద ప్రధాన రహదారిపై సురేష్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనంపై 50లీటర్ల గుడుంబాను తరలిస్తు పట్టుబడ్డట్టు ఎస్సై సురేష్ తెలిపారు. జాటోత్ వసంత్, అజ్మీరా లక్కుపై కేసు నమోదు చేసినట్లు సురేష్ తెలిపారు. నిషేధిత గుడుంబాను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



రాహుల్ (ఫైల్)

గణపురం : మండలంలోని నగరంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఇంట్లో కూలర్ ఆన్ చేస్తున్న క్రమంలో బాషబోయిన రాహుల్(16) విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపల్లికి చెందిన బాషబోయిన బాలరాజు కుమారుడు రాహుల్ రాత్రి ఇంట్లో కూలర్ ఆన్ చేయడానికి హోల్డర్‌లో విద్యుత్ వైర్లను పెట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో వారి కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మలేరియా వ్యాధిని నిర్మూలించాలి



వాజేడు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వాజేడు : మలేరియాను నిర్మూలించాలని వాజేడు వైద్యులు మధుకర్, మహేందర్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు మలేరియా బారిన పడకుండా, కీటక జనిత వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి చెట్లను పెంచాలన్నారు. దోమ తెరలను ఉపయోగించాలని, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వకుండా చూడాలని నినాదాలు చేశారు. అనంతరం వైద్యశాలలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మలేరియా నిర్మూలన, నివారణ అంశాలను సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు వివరించారు. అనంతరం మలేరియా నిర్మూలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో మాతా, శిశుసంరక్షణ వైద్యాధికారి యోషిత, కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, శిరీష, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

11 గంటల వరకు ఇంటికి చేరుకోండి

ఎండ తీవ్రత దృష్ట్యా మండల ప్రజలు, కూలీలు ఉదయం 11 గంటల వరకు ఇంటికి చేరుకోవాలని వాజేడు వైద్యులు మహేందర్, మధుకర్, మాతా,శిశు సంరక్షణ వైద్యాధికారి యోషిత అన్నారు. మండల పరిధిలోని ఆరుగుంటపల్లి, ఘనపురం గ్రామాల్లో గురువారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామాల్లో రోగులను పరీక్షించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉందని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా పనులు ఉంటే ఉదయం 11 గంటల లోగా పూర్తి చేసుకుని ఇంటికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల శారద, కోటిరెడ్డి, సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని కాశీంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ మాజీ అధ్యక్షుడు, లారీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తెలంగాణ ఉద్యమకారుడు మార్రెళ్ల సేనాపతి గురువారం బీజేపీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి హనుమకొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సేనాపతితో పాటు 50 మంది యువకులు పార్టీలో చేరినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, జిల్లా ప్రచార కార్యదర్శి మందల రఘునాథరెడ్డి, అర్బన్ ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి, నాయకులు తోట ఓదెలు, ఊరేటి మునిందర్, నాంపల్లి కుమార్, బోరం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.